andhrajyothy.com


ఆంధ్రజ్యోతి

సోమవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 28.9 । కనిష్ఠం 24.7

నిర్మల్
జిల్లా వార్తలు

8

మంగళవారం 27 ఆగస్టు 2024



అమృత్ 2.0లో జిల్లాకు పెద్దపీట



- ఇక ప్రతీ ఇంటికి స్వచ్ఛ నీటి సరఫరాకు అవకాశం
- మురుగునీటి నిర్వహణకు మార్గం
- జిల్లాకు రూ. 88 కోట్లు
- నిర్మల్ అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ కల సాకారం

నిర్మల్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అమృత్‌పథకం ద్వారా విడుదలవుతున్న నిధుల్లో అమృత్ 2.0లో నిర్మల్ జిల్లాకు భారీగా నిధులు సమకూరే అవకాశం ఉంది. 2005-2006 ఆర్థిక సంవత్సరం నుంచి ఐదేళ్ల పాటు అమలు చేయనున్న అమృత్ 2.0 (అటల్ మిషన్ ఫర్ రిజెనువేషన్ అండ్ అర్బన్ ట్రాన్స్‌ఫర్మేషన్) కింద జిల్లాకు రూ.88కోట్ల దాక నిధులు అందే అవకాశాలున్నాయని అధికారులు చెబుతున్నారు. జిల్లాలోని నిర్మల్, ఖానాపూర్ పురపాలక సంఘాల నిధుల విడుదలకు మార్గదర్శకాలు జారీ అయ్యాయి.



స్వచ్ఛ తాగునీటి సరఫరాకు పెద్దపీట

అమృత్ 2.0లో భాగంగా కేంద్ర, రాష్ట్ర వాటాతో కలిపి ఐదేళ్ళ పాటు ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీరును అందించే ప్రణాళికను ఈ కార్యక్రమంలో రూపొందించింది. ప్రతీ ఇంటికి రిజర్వాయర్‌ల నుంచి కులాయిల ద్వారా స్వచ్ఛమైన తాగునీటిని అందించడం ప్రణాళిక లక్ష్యంగా పెట్టుకున్నారు. మిషన్ భగీరథ అమలులో ఉన్నప్పటికి ఇంటింటికి పంపిణీ అవుతున్న తాగునీటిని అన్ని కుటుంబాల ప్రజలు వినియోగించుకోవడం లేదు. తాజాగా అమృత్ 2.0 కింద విడుదలైన నిధులతో స్వచ్ఛ తాగునీటి వ్యవస్థకు శాశ్వత ప్రణాళికను అమలు చేసే అవకాశం ఏర్పడింది. మరోవైపు మురుగునీటి వ్యవస్థ నిర్వహణలో భాగంగా మురుగు నీటిశుద్ధి కార్యక్రమాన్ని కూడా ఇందులో అమలు చేయనున్నారు. ఐదేళ్ల పాటు అమలు చేయనున్న ఈ పథకంలో నిర్మల్ మున్సిపాలిటీకి రూ. 65 కోట్లు, ఖానాపూర్ మున్సిపాలిటీకి రూ. 22 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధుల విడుదల మరింత పెరిగే అవకాశం ఉందని తెలుస్తోంది.



అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థకు మార్గం సుగమం

జిల్లా కేంద్రంలో గత కొన్ని దశాబ్దాలుగా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి ప్రతిపాదనలున్నాయి. అయితే నిధులు లేక ఈ పనులు ముందుకు జరగలేదు. ప్రముఖ ఏజెన్సీతో ప్రాజెక్టు రిపోర్టు తయారు చేసి సిద్ధంగా ఉన్నప్పటికి నిధులు లేక అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు జరగలేదు. తాజాగా అమృత్ పథకం కింద నిధులు మంజూరవుతున్న నేపథ్యంలో మంచినీటి సరఫరా వ్యవస్థతో పాటు మురుగునీటి నిర్వహణ వ్యవస్థలో భాగంగా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. దీంతో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి మార్గం సుగమం కానుంది.



లోక కల్యాణార్థం మహా పాదయాత్ర

- మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ • కదిలికి పాదయాత్ర ప్రారంభం • పాల్గొన్న డీసీసీ శ్రీహరిరావు • అడుగడుగునా ఆధ్యాత్మిక శోభ


బయలుదేరిన మహాపాదయాత్ర, ఇన్‌సెట్‌లో డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు

నిర్మల్ కల్చరల్, ఆగస్టు 26 : లోక కల్యాణార్థం నిర్మల్ నుంచి కదిలి పాపహరేశ్వరాలయానికి 8వ సారి మహాపాదయాత్ర చేపట్టడం జరిగిందని డీసీసీ అధ్యక్షుడు కే.శ్రీహరిరావు, చైర్మన్ ఈశ్వర్ అన్నారు. సోమవారం స్థానిక నటరాజ్ నగర్‌లోని శివాలయం నుంచి సాయిదీక్ష సేవా సమితి అధ్యక్షుడు లక్కడి జగన్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన మహాపాదయాత్ర వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వామిని దర్శించుకొని ప్రత్యేకపూజలు చేశారు. ఇలాంటి మహా కార్యక్రమాలు ప్రజల్లో ఆధ్యాత్మిక భావనలు పెంపొందిస్తాయని సత్ప్రవర్తన అలవరుస్తాయన్నారు. శివనామ స్మరణతో యాత్ర కొనసాగింది. మహిళలు పెద్ద ఎత్తున అడుగడుగునా మంగళహారతులతో హాజరుకాగా ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. పిల్లలు, పెద్దలు, ప్రజలు మహాపాదయాత్రలో భాగస్వాములు అయ్యారు. ప్రజలు, రైతులు సుభిక్షంగా ఉండాలని కోరుకున్నారు.

భక్త జనసంద్రమైన పాపన్న లొద్ది


పాప హరేశ్వర స్వామి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

దిలావర్‌పూర్, ఆగస్టు 26 : భక్తుల కొంగు బంగారం కదిలి పాపహరేశ్వర స్వామి కొలువైన పాపన్నలొద్ది సోమవారం వేలాదిగా తరలివచ్చిన భక్తులతో జనసంద్రంగా మారింది. శ్రావణమాసం చివరి సోమవారం కావడంతో తమ ఇష్టదైవమైన పాపహరేశ్వరస్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకునేందుకు భక్తులు గంటల తరబడి బారులు తీరారు. గోముఖ గుండంలో పవిత్ర స్నానాలు చేసిన భక్తులు అన్నపూర్ణేశ్వరి సమేత పాపహరేశ్వర స్వామిని దర్శించుకున్నారు. 18 వృక్షాలతో కూడిన మహావటవృక్షం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఋషిగుండంలోని పవిత్రజలాలను ఇళ్లలో, పంటలపై చల్లేందుకు వెంట తీసుకెళ్లారు. స్వామివారి సన్నిధి లోనే కొలువైన నాగదేవతకు కొబ్బరికాయలు కొట్టి పిల్లా పాపలను, పశుపక్షాదులను చల్లంగా చూడాలని మొక్కుకున్నారు. మాతా అన్నపూర్ణేశ్వరిదేవిని దర్శించుకుని కుంకుమార్చన పూజలు చేశారు. పాపహరేశ్వర స్వామి దర్శనం కోసం 'కదిలి' వచ్చిన భక్తులకు ముథోల్ నియోజకవర్గంలోని భైంసా మండలం అంబుగామ్ గ్రామానికి చెందిన సుదర్శన్ పటేల్ దంపతులు అన్నదానం చేశారు. దిలావర్‌పూర్ పోలీసులు బందోబస్తు నిర్వహించగా, కదిలి పాపహరేశ్వరస్వామి సేవాదళ్ వాలంటీర్లు భక్తులకు సేవలందించారు. దేవస్థానం చైర్మన్ నార్వాడీ వెంకట్‌రావు పాటిల్ ఆధ్వర్యంలో పాలకవర్గం సదుపాయాలు కల్పించి, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పర్యవేక్షణ చేశారు. దాదాపు 25 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

సీసీ కెమెరాలతో నేరాలు నియంత్రణ

- పెంబి మండల పర్యటనలో ఎస్పీ జానకీషర్మిల


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ జానకి షర్మిల

పెంబి, ఆగస్టు 26 : సీసీ కెమెరాలతో నేరాలు నియంత్రించవచ్చని జిల్లా ఎస్పీ జానకీషర్మిల అన్నారు. సోమవారం మండలంలోని పెంబి, మందపల్లి గ్రామాల్లో పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నూతన సీసీ కెమెరాలను ప్రారంభించారు. వేణునగర్ గ్రామంలో ఆదివాసీలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఒక సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానమని నేరాలను అరికట్టడంలో సీసీ కెమెరాలు ఎంతో తోడ్పడతాయన్నారు. ప్రతి షాప్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పకుండా ధరించాలన్నారు. వాహన దారులు లైసెన్స్ వెంట తప్పకుండా ఉంచుకోవాలన్నారు. అంతకు ముందు ఎస్పీ జానకి షర్మిలకు ఆదివాసి ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. సాంప్రదాయబద్ధంగా నృత్యాలు చేశారు. ఆదివాసీలతో కలిసి ఎస్పీ నృత్యం చేశారు. ఆదివాసీలు అన్ని రంగాల్లో ముందుండాలని తమ పిల్లలకు మంచి విద్యను అందించాలని, చదువుకుంటే అన్ని సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. అనంతరం కూరగాయలు, చీరలు, హెల్మెటను, వాలీబాల్ కిట్లను పంపిణీ చేశారు. అనంతరం పెంబి పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన ఎస్పీకి స్థానిక నాయకులు, ప్రజలు శాలువాతో ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ గంగారెడ్డి, సీఐ సైదారావు, ఎస్సైలు శంకర్, లింబాద్రి, నాయకులు స్వప్నిల్ రెడ్డి, మోహన్ రెడ్డి, భీమన్న, రాజన్న, బోరె రమేష్, పుప్పాల నర్సయ్య, సుతారి మహేందర్, ఖాన్, గన్నారపు సురేష్, శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.


గిరిజనులతో నృత్యం చేస్తున్న ఎస్పీ

దేశం కోసం కమలం మరింత వికసించాలి

- మీ కృషి ఫలితమే మాకు ఈ పదవులు • కార్యకర్తలే బీజేపీ బలం, బలగం • ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి


సమావేశంలో పాల్గొన్న బీజేపీ శ్రేణులు

దిలావర్‌పూర్, ఆగస్టు 26 : దేశం కోసం, ధర్మం కోసం మన పిల్లల భవిష్యత్తు కోసం కమలం మరింత వికసించవలసిన అవసరముందని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా సభ్యత్వ నమోదు కార్యశాల సిర్గాపూర్‌లోని రుక్మారెడ్డి గార్డెన్స్‌లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఆర్మూర్ శాసనసభ్యుడు పైడి రాకేష్ రెడ్డి, ముథోల్ శాసన సభ్యులు రామారావు పటేల్ హాజరయ్యారు. భారతీయ జనతా పార్టీ ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీగా అవతరించి నరేంద్రమోదీ మూడవసారి ప్రధానమంత్రి పదవిని చేపట్టడం కార్యకర్తల శ్రమ ఫలితమేనన్నారు. కార్యకర్తలే బీజేపీకి బలం, బలగం అన్నారు. ప్రపంచంలో ముస్లింలను కాపాడుకునేందుకు 57 దేశాలుండగా, క్రిస్టియన్‌లను కాపాడుకునేందుకు 160 దేశాలున్నాయని కానీ మన హిందువులను కాపాడేందుకు ఒకే ఒక దేశం ఉందని అదే మన భారత దేశమన్నారు. ఈ దేశంలో కేవలం భారతీయ జనతాపార్టీ మాత్రమే హిందువులకు అండగా ఉంటుందని అన్నారు. దేశం కోసం, ధర్మం కోసం బీజేపీ సభ్యత్వ నమోదును ఉత్సాహంగా చేపట్టాలని కోరారు. దేశ ధర్మరక్షణలో భాగం కావాలని అన్నారు. బంగ్లాదేశ్‌లో హిందువులను హింసించి చంపినా... మొన్నటికి మొన్న పశ్చిమ బెంగాల్ ట్రైనీ డాక్టర్‌ను పాశవికంగా హింసించి చంపినా కేసీఆర్, రేవంత్ రెడ్డి, సిద్ధిరామయ్య, స్టాలిన్ నోళ్లకు ఏమైందని... ఒక్క మాట మాట్లాడారా...? అని ప్రశ్నించారు. దేశంలో ఒక సిద్ధాంతం మీద నిలబడిన పార్టీ బీజేపీనేనన్నారు. ప్రతి కార్యకర్త సభ్యత్వ నమోదులో భాగస్వాములు కావాలన్నారు. సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని సెప్టెంబరు ఒకటవ తేదీన జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ప్రారంభిస్తారని, మన తెలంగాణ రాష్ట్రంలో సెప్టెంబర్ మూడు నుంచి రాష్ట్ర అధ్యక్షులు కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి ప్రారంభిస్తారని చెప్పారు. ప్రతి కుటుంబంలో ఒకరు బీజేపీ సభ్యులై ఉండాలని కోరారు. తెలంగాణలో అధికారంలోకి రావడానికి ఈ సభ్యత్వం దోహదపడుతుందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని, అందుకు తమవంతు సహకారం ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యత్వ జిల్లా కోఆర్డినేటర్ కమల్ నయన్, పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్నగారి భూమయ్య, రాష్ట్ర నాయకులు రావుల రాంనాథ్, మాజీ జడ్పీ చైర్ పర్సన్ సత్యనారాయణగౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ మల్లికార్జున్‌రెడ్డి, రితేష్‌రాథోడ్, హరినాయక్, గోపాల్, గంగారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు సామ రాజేశ్వర్, మేడిసెమ్మె రాజు, పైడిపెల్లి గంగాధర్, మోహన్ పటేల్, నగర్ నారాయణ్‌రెడ్డి, జిల్లా పదాధికారులు, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, మండల సభ్యత్వ కన్వీనర్, కో కన్వీనర్లు, జిల్లాలోని ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

బొడ్డోనికుంట కలుషితంతో రోగాల బారిన పడుతున్నాం

- మా సమస్యకు పరిష్కారం చూపండి • కుంట వద్ద బైఠాయించి కాలనీ వాసుల నిరసన

ఖానాపూర్, ఆగస్టు 26 : పట్టణంలోని శాంతినగర్ కాలనీలోని బొడ్డోని కుంటలో చెత్తా, చెదారం పేరుకుపోయి కలుషితం అవ్వడంతో ఈగలు, దోమలు ప్రబలి అనారోగ్యం బారిన పడుతున్నామని శాంతినగర్ కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం కాలనీకి చెందిన పలువురు యువకులు బొడ్డోని కుంట వద్దకు చేరుకొని రోడ్డుపై బైఠాయించి ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రతి వర్షాకాలం తమ కాలనీలో ప్రజలు టైఫాయిడ్, మలేరియా, డెంగ్యూ లాంటి వ్యాధుల బారిన పడి తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారన్నారు. బొడ్డోని కుంటలో డ్రైనేజీ నీరుతో పాటు చెత్తా, చెదారం, జంతువుల కళేబరాలు వేస్తుండడంతో ఈ ప్రాంతమంతా దుర్గంధ భరితంగా మారుతుందని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఏడాది వైరల్ ఫీవర్స్‌తో తమ ప్రాంతమంతా అల్లాడుతున్న తమను పట్టించుకునే నాథుడే లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. డెంగ్యూ, మలేరియా లాంటి వ్యాధులు సోకడంతో నిత్యం కాలనీ నుండి పదుల సంఖ్యలో ప్రజలు నిర్మల్, మెట్‌పల్లి, నిజామాబాద్, హైదరాబాద్ లాంటి పట్టణాలలోని ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లి చికిత్సలు చేయించుకుంటూ అప్పుల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పాలకులు కేవలం సోషల్ మీడియాలో ప్రచారం చేసుకునేందుకు మాత్రమే పరిమితమవుతున్నారే తప్పా క్షేత్రస్థాయిలో ఉన్న తమ సమస్యలను పరిష్కరించడం లేదన్నారు. బొడ్డోని కుంటతో శాంతినగర్ కాలనీలో నెలకొన్న సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా చర్యలు చేపట్టే వరకు దశల వారీగా తమ పోరాటాన్ని కొనసాగిస్తామన్నారు. మంగళవారం కాలనీ వాసులందరికీతో కలిసి మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఆయన స్పందించకపోతే జిల్లా కలెక్టరేట్ ఎదుట ఆందోళన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో శాంతినగర్ కాలనీ వాసులు వెంకటేష్, అబ్బాస్, రాజేందర్, శంకర్, తదితరులున్నారు.


బొడ్డోనికుంట వద్ద బైఠాయించి నిరసన వ్యక్తం చేస్తున్న శాంతినగర్ కాలనీ వాసులు

ఇంట్లో దూరిన కొండచిలువ


కొండ చిలువను పట్టుకున్న దృశ్యం

దిలావర్‌పూర్, ఆగస్టు 26 :మండలంలోని కాల్వ తండా గ్రామంలో సోమవారం కొండ చిలువ కలకలం రేపింది. శ్రావణ సోమవారం కావడంతో గ్రామానికి చెందిన లక్ష్మణ్ కుటుంబ సభ్యులు ఉదయం వేళ దైవ దర్శనం కోసం దేవాలయానికి వెళ్లారు. మధ్యాహ్నం ఇంటికి వచ్చారు. తలుపు తీయగానే కొండ చిలువ బుసలు కొట్టింది. భయపడ్డ వారు వెంటనే పాములు పట్టే వ్యక్తిని రప్పించి కొండ చిలువను చాకచక్యంగా బంధించారు. ఈ కొండ చిలువ ఎనిమిది అడుగుల పొడవు ఉంది.

సంక్షిప్త సమాచారం

విద్యుత్‌షాక్‌తో ఆవు మృతి



దిలావర్‌పూర్, ఆగస్టు 26 : మండలంలోని మాడెగాంలో ఆదివారం మధ్యాహ్నం విద్యుత్‌షాక్‌తో ఆవు మృతి చెందింది. గ్రామానికి చెందిన పులిండ్ల శ్రీనివాస్ ఆవును మేపేందుకు గ్రామ శివారులో పచ్చగడ్డి భూములకు వెళ్లాడు. అయితే 11 కేవీ విద్యుత్ లైన్ తెగి పడిన విషయం తెలియని శ్రీనివాస్ ఆవులను ముందుకు తోలాడు. కింద పడిన విద్యుత్ తీగ తగిలి ఆవు అక్కడికక్కడే మృత్యువాత పడింది. ఆవు విలువ రూ.40 వేలు ఉంటుందని శ్రీనివాస్ తెలిపారు. అధికారులు నష్టపరిహారం ఇవ్వాలని ఆయన కోరాడు.

మట్కా నిర్వహిస్తున్న వ్యక్తి అరెస్ట్

నిర్మల్ కల్చరల్, ఆగస్టు 26 : ఆన్‌లైన్ మట్కా నిర్వహిస్తున్న వ్యక్తిని సోమవారం అరెస్ట్ చేసినట్లు పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు. విశ్వనాథ్‌పేట్‌లో కొందరు వ్యక్తులు ఆన్‌లైన్ మట్కా నిర్వహిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు ఎస్సై రవీందర్‌తో కలిసి తనిఖీలు నిర్వహించామని తెలిపారు. అనుమానాస్పదంగా కనిపించిన షైక్ అఫ్రోజ్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారించగా నేరం ఒప్పుకున్నాడని తెలిపారు. నిందితుడిని అరెస్ట్ చేసి రూ. 27,000, మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నామన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

నిర్మల్ కల్చరల్, ఆగస్టు 26 : నిర్మల్ పట్టణం 11 కేవీ రెండో ఫీడర్ మరమ్మతుల దృష్ట్యా మంగళవారం పలు ప్రాంతాల్లో ఉదయం 9:30 నుండి 12 వరకు విద్యుత్ సరఫరా ఉండదు. బాగులవాడ, చిక్కడపల్లి, కమల్ టాకీస్, కస్బా, పాన్‌గల్లీ, శిశుమందిర్, జోహార్‌నగర్, కళానగర్, నగరేశ్వర్ వాడ, చింతకుంట వాడ వాసులకు అంతరాయం ఏర్పడుతుంది.

విశ్వనాథ్‌పేట్‌లో మరమ్మతులు

నిర్మల్‌లోని విశ్వనాథ్‌పేట్‌లో మరమ్మతుల దృష్ట్యా పలు ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది. వ్యవసాయ మార్కెట్, మోచిగల్లీ, బుధవార్‌పేట్, గాంధీచౌక్, కబుతర్ కమాన్, బంగల్‌పేట్, బోయవాడ, నాయుడివాడ, రామారావు బాగ్, సాయిబాబా ఆలయం, వైఎస్ఆర్ కాలనీ, గాజులపేట్, డాక్టర్స్ లేన్ ప్రాంతాల్లో ఉదయం 9:30 నుండి మధ్యాహ్నం 1 వరకు అంతరాయం కలుగనుంది.

కొత్త వారికి స్వాగతం పాత వారికి వీడ్కోలు

లక్ష్మణచాంద, ఆగస్టు 26 : మండల వ్యవసాయ విస్తరణ అధికారులు బదిలీ కాగా వారి స్థానంలో నూతన అధికారులు బాధ్యతలు చేపట్టిన విషయం అందరికీ తెలిసిందే. కాగా సోమవారం మండలంలోని నర్సాపూర్ (డబ్ల్యూ) గ్రామ రైతులు, నాయకులు కొత్త, పాత అధికారులను ఘనంగా సత్కరించారు. నూతన ఇన్‌చార్జి ఏవో వసంత్‌రావు, ఏఈవో మౌనిక, మాజీ ఏవో ప్రవీణ్ కుమార్, ఏఈవో సంతోష్ కుమార్‌లను శాలువా, పూలమాలతో సన్మానించి అభినందనలు తెలిపారు.

విద్యార్థుల సమస్యలు తెలుసుకుంటూ
వెంటనే పరిష్కరించేలా చూడాలి

● ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్ రూరల్, ఆగస్టు 26: వసతిగృహాల్లో చదువుకుంటున్న విద్యార్థుల సమస్యలను తెలుసుకుని వెంటనే పరిష్కరిచేలా చూడాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్‌శంకర్ అధికా రులను ఆదేశించారు. ఆదిలాబాద్ పట్టణంలోని శాంతినగర్ కాలనీలోని బీసీ బాలుర వసతి గృహాన్ని సోమ వారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల చదువులు, వారిసమస్యల గురించి అడిగితెలుసుకున్నారు. దోమల బెడద లేకుండా, పారిశు ధ్య సమస్య తలెత్తకుండా ముం దస్తు చర్యలు తీసుకోవాలని వార్డెన్‌కు సూచించారు. కష్ట పడి చదివి విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలని వారికి సూచించారు. అనంతరం వంట గదిని పరిశీలించి హాస్టల్ మెనూ వివరాలు అడి గి తెలుసుకున్నారు. ప్రభుత్వం పంపిణీ చేస్తున్న సన్నబియ్యం సరిగ్గా లేవని, పాత బియ్యం బాగున్నాయని విద్యార్థులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా హాస్టల్ నిర్వహణ తీరుపై ఎమ్మెల్యే అసంతృప్తి వ్యక్తం చేశారు. వెంటనే తీరు మార్చుకోవాలని సూచించారు. ఆయనవెంట హాస్టల్ సంక్షేమ అధికారి ఎం.శివకుమార్, సిబ్బంది ఉన్నారు.

ప్రైవేట్ ఆసుపత్రుల తనిఖీ

ఉట్నూర్, ఆగస్టు 26: మండల కేంద్రంలోని ప్రైవేట్ ఆసుపత్రలను జిల్లా ఏజెన్సీ వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కుడిమెత మనోహర్ సోమవారం తనిఖీ చేశారు. అంబేద్కర్‌చౌరస్తా సమీపంలో ఉన్న విజయలక్ష్మి మెడికల్ హాల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రైవేట్ ఆసుప త్రిలో రికార్డులను తనిఖీ చేశారు. ల్యాబ్, ఫార్మసీలు నిర్వహణ కోసం తపపనిసరిగా అను మతులు కలిగి ఉండాలని ఆదేశించారు. అను మతులు లేకుండా నిర్వహిస్తే చర్యలు తప్ప వని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు. ఆయన వెంట హెల్త్ ఎక్స్టెన్షన్ ఆఫీసర్ నాందేవ్, పవర్ రవీందర్, హెల్త్ సూపర్‌వైజర్ శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.



పొన్నారి ఆలయంలో పూజలు చేస్తున్న ఎంపీ

ప్రతీ పల్లెకు కేంద్ర ప్రభుత్వ పథకాలు

● ఆదిలాబాద్ ఎంపీ జి.నగేష్

తాంసి, ఆగస్టు 26 : కేంద్ర ప్రభుత్వ నిధులతో ప్రతీ పల్లెను అభివృద్ధి చేస్తానని ఆదిలాబాద్ ఎంపీ జినగేష్ అన్నారు. సోమవారం మండలం లోని పొన్నారి గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన ప్రారం భోత్సవాలు చేశారు. ముందుగా హనుమాన్ మందిరం, శ్రీ కృష్ణ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావే శంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్రమోది ప్రభుత్వం బడు గు, బలహీన ప్రజల అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులను వెచ్చిస్తుందన్నా రు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టే పథకాలలో ప్రజలు భాగస్వా ములై అభివృద్ధి చెందాలని కోరారు. తన నిధులతో ప్రతి గ్రామంలో అభి వృద్ధి పనులను ప్రారంభిస్తామన్నారు. గ్రామాల అభివృద్ధి కోసం రాజకీ యాలకు అతీతంగా సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయనను గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు సదా నందం, అరుణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి కోట్నాక్ భీంరావు వర్ధంతిని జయప్రదం చేయాలి: ఎమ్మెల్యే

ఉట్నూర్, ఆగస్టు26: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కోట్నాక్‌భీంరావు తొలి ఆదివాసీల ఎమ్మెల్యేగా, మంత్రిగా ఎన్నికై ఈ ప్రాంతానికి సేవలం దించారని ఖానాపూర్ నియోజక వర్గ ఎమ్మెల్యే వెడ్మబొజ్జుపటేల్ అన్నారు. సోమవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని తన కార్యాలయంలో వర్ధంతి పోస్టర్లను రాజ్‌గోండుసేవా సమితి, వర్ధంతి నిర్వహణ కమిటీ సభ్యులతో కలిసి విడుదలచేశారు. ఈ సందర్భంగా నిర్వహణ కమిటీ సభ్యులు ఎమ్మె ల్యేకు ఆహ్వాన పత్రికను అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ 29న ఉట్నూర్ మండల కేంద్రంలో మాజీ మంత్రి కొట్నాక్ భీంరావు వర్ధం తి వేడుకలను నిర్వహిస్తామన్నారు. ఆదివాసీలు, ప్రజలు, విద్యార్థులు, మే ధావులు కార్యక్రమానికి విచ్చేసి విజయవంతం చేయాలన్నారు. అనంతర ం రాజ్‌గోండు సేవా సమితి సభ్యులు ఐటీడీఏ పీఓకు సివిల్ సూటులను విచారించే అధికారం లేదని హైకోర్టు తీర్పు ఇచ్చిందని, రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయం పై ప్రత్యేక చొరవ తీసుకొని మళ్లీ ఐటీడీఏ పీఓకు సివిల్ సూట్‌లను విచారణ చేసే విధంగా అధికారాలు ఇవ్వాలని కోరుతూ ఎమ్మె ల్యే వెడ్మబొజ్జుపటేల్‌కు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మె ల్యే సానుకూలంగా స్పందించి సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్తామని పే ర్కొన్నారు. కార్యక్రమంలో కొట్నాక్ భీంరావు వర్ధంతి నిర్వహణ కమిటీ సభ్యులు, రాజ్‌గోండు సేవా సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న పంటపై అడవి పందుల దాడి

ఉట్నూర్, ఆగస్టు26: మండలంలోని పులిమడుగు సమీపంలో ఉన్న మొక్కజొన్న పంటపై ఆదివారం రాత్రి అడవి పందులు దాడి చేసి మొక్క జొన్న పంటను ధ్వంసం చేశాయని పులిమడుగుకు చెందిన రైతులు వా పోతున్నారు. పులిమడుగు చెందిక రైతులు నూర్‌సింగ్, అర్చన, నాగోరావు లకు చెందిన ఏడున్నర ఎకరాలలో సాగు చేస్తున్న మొక్కజొన్న పంటను ధ్వంసం చేసినట్లు రైతులు తెలిపారు. అటవీశాఖ అధికారులు నష్టపోయి న పంటకు నష్టపరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.



అడవి పందుల దాడిలో ధ్వంసమైన మొక్కజొన్న పంట

సిరిచెల్మా ఆలయానికి పోటెత్తిన భక్తులు

ఇచ్చోడ, ఆగస్టు 26: జిల్లాలోని అతి ప్రాచీనా సిరిచెల్మా మల్లికార్జున ఆలయం శ్రావణ మాసంను పురస్కరించుకుని నాలుగవ సోమవారం మల్లన్న భక్తులు ఆలయాన్ని సంధర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున హాజరు కావడంతో స్వామి వారికి అర్చన, అభిశేకాలు, నైవేద్యాలు సమర్పించి భక్తులు తమతమత కోరికలను నెరవేర్చుకున్నారు. అదేవిధంగా కోరికలు తీర్చే మల్లన్నగా ప్రసిద్ధిగాంచిన సిరిచెల్మా కు ఉదయం నుంచి భక్తుల రద్దీ పెరగడంతో అత్యంతా వైభవంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. జిల్లా నుంచే కాకుండా ఇతర జిల్లాల నుంచి, అలాగే మహరాష్ట్ర నుంచి పెద్ద ఎత్తున భక్తులు హాజరై మొక్కులు చెల్లించుకున్నారు.


ఆలయంలో మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

● శివాలయాలలో భక్తుల రద్దీ

ఆదిలాబాద్ అర్బన్: శ్రావణ మాసం సందర్భంగా జిల్లాలోని ప్రధాన ఆలయాలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. శ్రావణ సోమవారం కావడంతో శివాలయాలకు భక్తులు క్యూకట్టారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని గంగపుత్ర ఆలయం, ఉమామహేశ్వర ఆలయంతో పాటు తదితర ఆలయాలలో తెల్లవారు జాము నుంచి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తుల సౌకర్యార్థం ఆలయ కమిటీ సభ్యులు భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేపట్టారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

నేడు ఆర్‌ఎంపీలకు అవగాహన సదస్సు

బోథ్, ఆగస్టు 26 : ఈనెల 27న ఆర్‌ఎంపీలకు అవగాహన సదస్సును నిర్వహిస్తున్నట్లు బోథ్ మండల ఆర్‌ఎంపీల అధ్యక్షులు ప్రధాన కార్యదర్శి మాసుపత్రి విశ్వనాథ్, అశోక్, సదాశివలు తెలిపారు. జిల్లా కలెక్టర్ జిల్లా వైద్యాధికారి ఆదేశాల మేరకు ఈనెల 27న జిల్లా వైద్యాధికారి కాన్ఫరెన్స్ హాల్‌లో సదస్సు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. సదస్సును విజయవంతం చేసేందుకు గాను మండలంలోని ఆర్‌ఎంపీలు మధ్యాహ్నం రెండున్నర గంటలకు హాజరు కావాలని కోరారు.

నూతన ఉత్పాదన ఇంప్లిసిట్ విడుదల

ఆదిలాబాద్ రూరల్, ఆగస్టు 26: భారతీయ బహుళ జాతీయ సంస్థ పారిజాత్ ఇండస్ట్రీస్ అండ్ ప్రైవేట్ లిమిటెడ్ ఇండియా ఆధునాతన సాంకేతిక పరిశోధనతో రూపొందించిన ఇంప్లిసిట్ కీటకనాశిని పురుగుల మందును ఆదిలాబాద్‌లో సంస్థ సౌత్ డీజీఎం య.శ్రీనివాసులు రెడ్డి సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని రకాల క్రిమిసంహారక మందులతోపాటు మొక్కలకు పోషకాలు అందించే ఉత్పత్తుల పోర్టుఫోలియో పారిజాత్ అని పేర్కొన్నారు. ఇంప్లిసిట్, పత్తి, సోయా, మిరప, కూరగాయల పంటల్లో వచ్చు రబ్బరు పురుగు, లద్దె పురుగు, తామర పురుగు, నల్లి జాతుల నివారణకు ఇంప్లిసిట్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో తెలంగాణ రీజినల్ హెడ్ ఆర్.రాజేందర్, మార్కెటింగ్ మేనేజర్ వి.ప్రసన్న కుమార్, ఆదిలాబాద్ టెర్రిటరీ మేనేజర్ ఎస్.చంద్రకాంత్ రెడ్డి, నిజామాబాద్ టెర్రిటరి మేనేజర్ ప్రవీణ్‌కుమార్, డిస్ట్రిబ్యూటర్లు, డీలర్లు, తదితరులు పాల్గొన్నారు.



పురుగుల మందును విడుదల చేస్తున్న కంపెనీ ప్రతినిధులు

వాడవాడలా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

● ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా ఘనంగా వేడుకలు

నేరడిగొండ, ఆగస్టు 26: మండలంలో శ్రీకృష్టామి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించుకున్నారు. పలు గ్రామాల్లో చిన్నారులు కృష్ణుడి వేశాదారణలో సందడి చేశారు. లంబాడ, మథురా కులస్థులు తమ ఆరాధ్య దైవమైన శ్రీకృష్ణుడు(కన్నయ్య) గోకులాష్టమి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. నేల రోజులు ఉపవాస దీక్షలు చేపట్టి గోకులాష్టమి రోజున తమ ఇంటి ఎదుట శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు చేసి గ్రామస్తులకు అన్నదానం నిర్వహించారు. మధుర కులస్థులు గ్రామ సమీపంలో గల పుట్ట మట్టిని తీసుకొచ్చి ఇళ్లల్లో చిన్ని కృష్ణడి మట్టి ప్రతిమను తయారు చేసి ప్రత్యేక పూజలు చేశారు. ఆనంతరం రాత్రి జావ, వోమ, ఆజ్వాన్‌తో తయారు చేసిన నైవేద్యాన్ని సమర్పించారు. ఈకార్యక్రమంలో మాజీ ఎంపిపి రాథోడ్ సజన్, గ్రామాభివృద్ధి కమీటి అధ్యక్షుడు ఏలేటి రవిందర్‌రెడ్డి, సంతోస్‌సింగ్, మాజీ ఉప సర్పంచ్ దేవేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బోథ్: మండలంలోని వివిధ పాఠశాలల్లో సోమవారం శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. వేదం సరస్వతి శిశు మందిర్, సన్ షైన్ పాఠశాలల్లో విద్యార్థులు ఉట్టికొట్టే కార్యక్రమాలతో పాటు విద్యార్థులు శ్రీ కృష్ణుడు గోపికల వేషాలలో ఆకట్టుకున్నారు. ఇందులో ప్రధానోపాధ్యాయుడు రాజేందర్‌గౌడ్, ఉసికెలా కార్తీక్, పి.సంతోష్, కిషోర్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



బజార్‌హత్నూర్: మండలకేంద్రం లోని స్థానిక ఎస్‌వీ, కురుక్షేత్ర పాఠశాలల్లో శ్రీ కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్‌లు నానక్‌సింగ్, నవీన్ విద్యార్థులకు శ్రీకృష్ణుని జన్మ వృత్తాంతాన్ని వివరించారు. శ్రీకృష్ణుని మేనమామ అయిన రాక్షసుడు కంసున్ని వదించేందుకు చరసాలలో తల్లి దేవకి వసుదేవుడులకు ఆయన జన్మించాడని విద్యార్థులకు వివరించారు. విద్యార్థిని, విధ్యార్థులు చిన్ని కృష్ణుడు, గోపికల వేషదారణలో అలరించారు. అనంతరం గోపికలు ఉట్టిని లాగగా శ్రీకృష్ణుడి వేషదారణలో ఉన్నా విద్యార్థులు ఉట్టిని పగలగొట్టారు.


బోథ్‌లో శ్రీకృష్ణగోపికల వేషధారణలో పాఠశాల విద్యార్థులు


నేరడిగొండలో నృత్యాలు చేస్తున్న గోపికలు

ఇచ్చోడ: మండలంలోని సన్‌షైన్ పాఠశాలలో సోమవారం ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా బాలురు శ్రీకృష్ణుని, బాలికలు గోపికా వేశధారణలో వచ్చి ఉట్టిని పగుట గొట్టి పండుగ వాతావరణాన్ని సృష్టించారు. ఇందులో కరస్పాండెంట్ గణేష్, రాకేష్, సంజయ్, ప్రిన్సిపాల్ విజయ్, నడిపన్న, మారుతి టీచర్లు పాల్గొన్నారు.

జైనథ్: మండలంలోని మాండగడ, తరోడ(బి)లతో పాటు తదితర గ్రామాలలో సోమవారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తరోడ(బి) మురళికృష్ణ ఆలయం సోమవారం అర్ధరాత్రి శ్రీకృష్ణ జన్మాష్టమి 12గంటల వరకు జాగరణ, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. అలాగే, కరంజి గ్రామ శ్రీకృష్ణ ఆలయంలో శ్రీకృష్ణజన్మాష్టమి సందర్భంగా డప్పులు భాజాల మధ్య నగర సంకీర్తనను నిర్వహించారు. మాండగడ గ్రామంలో శ్రీకృష్ణ ఆలయంలో రాదాకృష్ణుడు, గోపిక వేషధారణల మధ్య చిన్నారుల సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి గ్రామంలో డప్పులు భజాల మధ్య నగర సంకీర్తణను నిర్వహించారు. ఈ సందర్బంగా గ్రామంలో పారిజాతం మొక్కలను పంపిణీ చేశారు.


బజార్‌హత్నూర్‌లో శ్రీకృష్ణగోపిక వేషదారణలో చిన్నారులు

భీంపూర్: మండలంలోని పిప్పల్‌కోటి, తాంసి(కె), దన్నోరా, బెల్సరి రాంపూర్, అందర్‌బంద్, వడూర్, అర్లి(టి) అంతర్గం, గోముత్రి, కరంజి (టి) గుబ్‌డి తదితర గ్రామాలలో ఆలయాల్లో సోమవారం శ్రీ కృష్ణష్టామి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు.

తాంసి: శ్రీకృష్ణ జన్మాష్టమిని సోమవారం మండలంలోని ఆయా గ్రామాలలో ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుంచి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పొన్నారి గ్రామ సమీపంలోని ఓ జిన్నింగ్ ప్యాక్టరీలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిన్నారులు చేసిన వేషధారణలు ఎంతో ఆకట్టుకున్నాయి. గోపికలు, చిన్న కృష్ణుని వేషాలు ఎంతో అలరించాయి. పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు. వేలాదిమంది భక్తులు తరలివచ్చి శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు చేశారు.

గుడిహత్నూర్: శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను సోమవారం మండల వ్యాప్తంగా ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని శ్రీ సరస్వతి శిశు మందిర్ విద్యార్థులు గోపికా, కృష్ణుల వేషధారణలతో అలంకరించారు. ప్రధాన వీధులలో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఉట్టికొట్టే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానాచార్యులు కొండా రమాదేవి, ఆచార్యులు గ్రామస్థులు పాల్గొన్నారు.


గుడిహత్నూర్‌లో విద్యార్థుల సందడి

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

● మండల వైద్యాధికారి డాక్టర్ భీంరావు

బజార్‌హత్నూర్, ఆగస్టు 26: ప్రతీఒక్కరు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే సగం కంటే ఎక్కువ రోగాలను ఊరి నుండి తరిమేయవచ్చని డాక్టర్ భీంరావు అన్నారు. సోమవారం మండలంలోని టెంబి గ్రామ పంచాయతీ పరిదిలో గల చినుమియా తండా గ్రామంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ గ్రామానికి సరైనా రోడ్డు సౌకర్యం లేకపోవడంతో మూడు కిలోమీటర్లు కాలినడక ద్వారానే సిబ్బంది గ్రామానికి చేరుకున్నారు. గ్రామంలోని దాదాపు 50మందికి పైగా వైద్య పరీక్షలు చేశారు. అందులో 12మంది గ్రామస్థులకు జ్వరం ఉండడంతో వారి రక్త నమూనాలను సేకరించి వివిధ పరీక్షల కోసం ల్యాబరేటరికి పంపించామని డాక్టర్ భీంరావు తెలిపారు. ప్రస్తుతం వైరల్ ఫీవర్‌ల వ్యాప్తి ఎక్కువగా ఉండడం వల్ల ప్రతీరోజు రెండు మూడు గ్రామాలలో వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేసి వారికి అక్కడే మందులు అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఈవో సూర్య ప్రకాష్, హెల్త్ అసిస్టెంట్ రమేష్, ఏఎన్‌ఎం విజయ, తదితరులు పాల్గొన్నారు.


చినుమియా తండాకు కాలినడకన వెళ్తున్న వైద్య సిబ్బంది

సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలి

నార్నూర్: మండలంలోని కొత్తపల్లి(హెచ్) గ్రామ పంచాయతీ బొజ్జుగూడ(కె) మల్కుగూడ తండాలో ప్రభుత్వ వైద్య సిబ్బంది వైద్య శిబిరం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా చరణ్‌దాస్ వైద్య సిబ్బంది మాట్లాడుతూ వర్షాకాలం మన ఇంటి చుట్టు పక్కల ప్రాంతాన్ని శుభ్రంగా ఉంచుకోవాలి. గడ్డి, పిచ్చిమొక్కలు ఉండడం వలన దోమలు, ఈగలు వచ్చే ఆస్కారం ఉంటుంది. అవి కుట్టడం లేదా మనం తినే ఆహారం మీద ఈగలు కూర్చోవడంతో మనకు రోగాలు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఇది సీజనల్ వ్యాధులకాలం కాబట్టి అందరు జాగ్రత్తగా ఉండాలని ఆయన పేర్కొన్నారు. అనంతరం గ్రామస్థులకు మలేరియా జ్వరం బీపీ, షుగర్ ఇతర పరీక్షలు 101 మందికి చేశారు. రోగులకు మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ జవహర్‌లాల్, ఏఎన్‌ఎం శ్యామ్‌కా, ఆశా వర్కర్లు లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.


మల్కుగూడ తండాలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కాల్వ తండాలో ప్రారంభమైన తీజ్ ఉత్సవాలు


బుట్టలతో సేవాలాల్ ఆలయానికి వెళ్తున్న యువతి యువకులు

దిలావర్‌పూర్, ఆగస్టు 26 : మండలంలోని కాల్వ తండాలో సోమవారం తీజ్ ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. గ్రామంలోని యువతులు సాంప్రదాయ దుస్తులు ధరించి వెదురు బుట్టల్లో మట్టిని నింపి అందులో గోధుమలు చల్లి ఆ బుట్టలతో నృత్యాలు చేస్తూ ర్యాలీగా స్థానిక సేవాలాల్ జగదాంబ ఆలయానికి తీసుకవెళ్లారు. అక్కడ వరుసగా పెట్టి ప్రత్యేక పూజలు చేశారు. ప్రతిరోజు ఆ బుట్టలపై నీళ్ల చల్లుతారు. వారం రోజుల పాటు పూజలు నిర్వహించి చివరి రోజు నిమజ్జనం చేయనున్నట్లు ధారావత్ రవీందర్ తెలిపారు.

'అన్నాబావు సాఠే ఆశయ సాధనకు అంకితమవుదాం'



భైంసా, ఆగస్టు 26 : సాహిత్య సామ్రాట్ అన్నాబావు సాఠే ఆశయ సాధనకు బాధ్యతాయుతమైన విధానాల ద్వారా అంకితమవుదామని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రాంరావ్ పాటిల్ పిలుపునిచ్చారు. సోమవారం భైంసాలో జరిగిన అన్నాబావు సాఠే జయంతి వేడుకలు, ఎస్సీ వర్గీకరణ ప్రక్రియలో సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పును పురస్కరించుకొని ముథోల్ నియోజక వర్గ ఎంఆర్‌పీఎస్ శ్రేణులు నిర్వహించిన సంబరాల కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. మాదిగల అభ్యున్నతిని దృష్టిలో పెట్టుకొని ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం వర్గీకరణ విషయంలో ఇచ్చిన హమీని నిలబెట్టుకుందని వెల్లడించారు. నియోజక వర్గ పరిధిలో అన్ని వర్గాల సంక్షేమానికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నట్లుగా పెర్కొన్నారు. భైంసాలో అన్నాబావు సాఠే విగ్రహ ఏర్పాటు విషయంలో నెలకొన్న నిధుల కొరతను తీర్చేందుకు గాను ప్రభుత్వ నిధుల మంజూరికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా పరిషత్ మాజీ చైర్మెన్ లోలం శ్యాంసుందర్, మాజీ ఎంపీపీ అబ్దుల్ రజాక్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ రాజేష్‌బాబు, బీజేపీ ప్రతినిధులు సాంవ్లీ రమేష్, బోస్లే పండిత్‌రావ్, బాలాజీ సూత్రావే, బీసీ కులాల ఐక్యవేదిక ప్రతినిధి సుంకెట పోశెట్టి, ఎంఆర్‌పీఎస్,అన్నాబావు సాఠే కమిటీ ప్రతినిధులు ఉత్తమ్ బాలేరావ్, న్యామత్కర్ దిగంబర్, కత్తిబాబు, గోనేకర్ శంకర్, శెల్కె ఆనంద్ పాల్గొన్నారు.

చెట్ల నరికివేతపై విచారణ

ముథోల్, ఆగస్టు 26 : నియోజకవర్గ కేంద్రమైన ముథోల్‌లో ప్రభుత్వ ఆసుపత్రిలో ఏపుగా పెరిగిన చెట్లను నరికి వేసిన ఘటనపై సోమవారం అటవీ శాఖ అధికారులు విచారణ జరిపారు. ఆదివారం రోజు ఆసుపత్రి ఆవరణలో ఉన్న చెట్లను నరికి వేసిన ఈ వార్త పత్రికల్లో ప్రచురితమయ్యాయి. దీంతో అటవీ శాఖ సెక్షన్ ఆఫీసర్ నంద్యా నాయక్, బీట్ ఆఫీసర్ కృష్ణ విచారణ జరిపారు. నరికి వేసిన చెట్లను పరిశీలించి కొలతలు సేకరించారు. ఈ ఘటనపై ఆసుపత్రి వారికి అటవీ శాఖ అధికారులు నోటీస్ ఇవ్వనున్నట్లు సమాచారం.

పుస్తకాలు చదివి.. అభ్యాసం చేయాలి

నిర్మల్ కల్చరల్, ఆగస్టు 26 : పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులు ప్రామాణికమైన పుస్తకాలు చదవడంతో పాటు ప్రాక్టీస్ చేస్తే మంచి ఫలితం సాధించవచ్చునని ముఖ్య అతిథి పోటీ పరీక్షల విశ్లేషకులు ప్రొఫెసర్ ప్రసన్న హరికృష్ణ సూచించారు. సోమవారం గ్రంథాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ప్రాక్టీస్ చేయడంతో ఉద్యోగం సాధించవచ్చునన్నారు. విన్నర్స్ ఆన్‌లైన్ ద్వారా 5 లక్షల విలువ చేసే గ్రూప్ 2, 3, డీఎస్సీ అభ్యర్థులకు లక్ష విలువ చేసే పుస్తకాలు అందజేశారు. ప్రొఫెసర్లు కట్కం మురళి, రవికుమార్, మధు, లైబ్రరీ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా.. కృష్ణాష్టమి


భైంసాలో శ్రీకృష్ణుని వేషాధారణలో చిన్నారులు

భైంసా, ఆగస్టు 26 : రెవెన్యూ డివిజన్ కేంద్రమైన భైంసాలో సోమవారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని పట్టణ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో వేడుకలు కోలాహలంగా కొనసాగాయి. విద్యార్థులు శ్రీ కృష్ణుడు, గోపికల వేషాధారణలతో వేడుకల్లో పాల్గొన్నారు. ఉట్టికొట్టే కార్యక్రమం సందడిగా జరిగింది. వేదం తపోవన్ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో భైంసా హిందూ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పెండెపు కాశీనాథ్,తూమోల్ల ముత్తన్న సేవా సమితి ఫౌండర్ తూమోల్ల దత్తాత్రిలు పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులందరూ పర్వదినాల ప్రాశస్త్యంపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. సనాతనమైన సంస్కృతి, సంప్రదాయలు, అచార వ్యవహరాలకు అనుగుణంగా నడుచుకోవాలన్నారు. ఇందులో వేదం విద్యా సంస్థల డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, కో డైరెక్టర్ వరలక్ష్మీరెడ్డిలు పాల్గొన్నారు.

హిందూవాహిని ఆధ్వర్యంలో గోపూజ

ముథోల్, ఆగస్టు 26 : మండల కేంద్రమైన ముథోల్‌తో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో శ్రీ కృష్ణాష్టమి వేడుకలను సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ముథోల్‌లో ఉత్సవ కమిటీ, హిందూవాహిని ఆధ్వర్యంలో గోపూజ ఉట్టి కొట్టే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కబడ్డీ పోటీలు నిర్వహించారు. అలాగే శిశుమందిర్ పాఠశాల విద్యార్థులు గ్రామంలోని ప్రధాన వీధుల్లో శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా కోలాటాలతో పాటు చిన్నారులు, విద్యార్థుల రాధాకృష్ణ, గోపికల వేషధారణ, నృత్యాలు ఆకట్టుకున్నాయి. శ్రీకృష్ణుడి ప్రతిమను ఏర్పాటు చేసి పూజలు చేశారు. ఉట్టి కొట్టే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, ఉత్సవ కమిటీ, హిందూవాహిని సభ్యులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

రాధాకృష్ణుల వేషాధారణ

కుంటాల : మండల కేంద్రం కుంటాల స్థానిక శాంతినికేతన్ విద్యానిలయంలో సోమవారం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేణు మాధవుడు లోకానికి గీతను బోధించి జగద్గురు అయ్యాడని, లోకంలో ఉండే ప్రతీ ఒక్కరికి దారి చూపాడని, చిన్నతనంలో కృష్ణుడు అల్లరిపిల్లాడిగా తన చిలిపి చెష్టలతో జీవిత పరామర్థాన్ని వివరించారని డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. వెన్న దొంగగా మారి గోపికలతో పాటు అందరి మనసులు దోచుకున్నాడని గోప బాలుడిగా, సోదరునిగా, అసుర సంహరిగా, ధర్మసంక్షకుడిగా కృష్ణుడు ఎన్నో పాత్రలు పోషించాడని ప్రిన్సిపల్ సంతోష్ అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని, విద్యార్థులు కృష్ణుని, గోపికల వేషాదారణలో ఆకట్టుకున్నారు. అనంతరం నృత్యాలు, దాగుడుమూతలు, కోలాటలు, ఉట్టికొట్టడం తదితర కార్యక్రమాలు నిర్వహించారు.

కోలాహలంగా ఉట్టి క్రీడ

కుభీర్, ఆగస్టు 26 : మండల కేంద్రంతో పాటు మండలంలోని పార్డి(బి), పల్సి, నిగ్వా, మాలేగాం తదితర గ్రామాల్లో సోమవారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణ దేవాలయంలో ఉదయం గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మండల కేంద్రంలోని యాదవ యువజన సంఘం ఆధ్వర్యంలో భట్టిగల్లీ హనుమాన్ ఆలయం వద్ద చిన్నారులు రాధకృష్ణ వేషాదారణతో ఉట్టి పగలగొట్టే కార్యక్రమాన్ని నిర్వహించి పలు సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో యాదవ యువజన సంఘం నాయకులు కందూర్ శ్రీనివాస్, మ్యాకల నరేష్, నారడి మల్లేష్, కందూర్ చిన్న సాయినాథ్, పరుశురాం, శ్రీకాంత్, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో వేడుకలు

తానూర్, ఆగస్టు 26 : మండల కేంద్రం తానూర్‌తో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో సోమవారం శ్రీకృష్ణ జన్మాష్టమిని ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. చిన్నారులు కృష్ణుని వేషాదారణలో, గోపికల వేషాదారణలో అలరించారు. మండలంలోని బెంబర్ అంగన్‌వాడీలో కృష్ణమి ఘనంగా నిర్వహించారు. చిన్నారులు రాధాకృష్ణుని వేషాదారణలో ఉట్టి పగలగొట్టారు.



నర్సాపూర్(జి) , ఆగస్టు 26 : మండల కేంద్రంలో.. ఆయా గ్రామల్లో సోమవారం శ్రీకృష్ణ జన్మాష్టమి ఘనంగా నిర్వహించారు. వివిధ పాఠశాలలో చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపిక వేషధారణలతో చూపరులను ఆకట్టుకున్నారు. తురాటి గ్రామంలో, ఆలయాల్లో సాయంత్రం ఉట్టి కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజలు, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని సంబురాలను జరుపుకున్నారు.

'దిలావర్‌పూర్ ఇథనాల్ పరిశ్రమను రద్దు చేయాలి'

దిలావర్‌పూర్, ఆగస్టు 26 : ప్రజాభిప్రాయ సేకరణ ప్రక్రియ చేపట్టకుండా దిలావర్‌పూర్‌లో ఇథనాల్ పరిశ్రమ నిర్మాణానికి పూనుకోవడం చట్ట విరుద్ధమని, వెంటనే నిర్మాణాన్ని ఆపి పరిశ్రమను రద్దు చేయాలని తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర కన్వీనర్ కన్నెగంటి రవి డిమాండ్ చేశారు. టీపీటీఎఫ్ రాష్ట్ర నాయకుడు కొండల్ రెడ్డి, చిత్తనూరు ఇథనాల్ కంపెనీ వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు బండారి లక్ష్మయ్య, టీజాక్ జిల్లా కన్వీనర్ ఆరేపల్లి విజయ్ కుమార్, సామాజిక కార్యకర్త రాజగోపాల్ కలిసి వచ్చి సోమవారం దిలావర్‌పూర్ మండల కేంద్రంలో ఇథనాల్ కంపెనీని రద్దు చేయాలని 35 రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్న రైతులకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా కన్నెగంటి రవి మాట్లాడుతూ... ప్రజాస్వామ్యాన్ని పాతరేసి రేవంత్ రెడ్డి ప్రభుత్వం పెత్తందారులకు వత్తాసు పలకడం దారుణమన్నారు. ఇప్పటికైనా బాధిత గ్రామాల రైతులు, ప్రజల గోడును వినాలని వారి డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. ఇథనాల్ కంపెనీల వల్ల గాలి, నీరు భూమి కాలుష్యం ఏర్పడుతుందన్నారు. వ్యవసాయం దెబ్బతింటుందన్నారు. బియ్యం, మొక్కజొన్నతో ఇథనాల్ ఉత్పత్తి చేయడం వల్ల భవిష్యత్‌లో ఆహార కొరత ఏర్పడుతుందన్నారు. పర్యావరణం నాశనమవుతుదన్నారు. ప్రజల జీవితాలను ధ్వంసం చేస్తున్న ఇథనాల్ కంపెనీని రద్దు చేయాలన్నారు. ఇథనాల్ కంపెనీ రద్దు అయ్యే వరకు ఈ పోరాటాన్ని విరమించరాదని బాధిత గ్రామాల ప్రజలకు సూచించారు. టీజాక్ ఎప్పటికీ పోరాడే ప్రజల వైపే నిలబడుతుందన్నారు. బండారి లక్ష్మయ్య మాట్లాడుతూ... చిత్తనూరు ఇథనాల్ కంపెనీ రద్దు చేయాలని జరిగిన పోరాటం నుంచి మనం అనేక గుణపాఠాలను నేర్చుకుని దీర్ఘకాల ప్రజాస్వామ్యం, శాంతియుత పోరాటం నడపవలసిన బాధ్యత మనం దరి మీద ఉందన్నారు. బీజేపీ తీసుకవచ్చిన ఇథనాల్ పాలసీని బీఆర్‌ఎస్ పార్టీ వ్యతిరేకించకుండా అమలు చేసిందని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం దాన్ని కొనసాగిస్తుందన్నారు. ఇథనాల్ పాలసీని వెంటనే రద్దు చేయాలని కోరారు. శాంతియుతంగా పోరాడుతున్న దిలావర్‌పూర్ ప్రజలపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తి వేయాలని డిమాండ్ చేశారు. కొండల్ రెడ్డి మాట్లాడుతూ... నిర్మల్ జిల్లా కలెక్టర్‌ను కలవడానికి వెళ్లి బాధిత ప్రజలను తరలించిన ఆటోలను సీజ్ చేయడమే కాకుండా అక్రమ కేసులు బనాయించారని వెంటనే వాటిని ఎత్తివేసి ఆటోలను విడుదల చేయాలన్నారు.


నినాదాలు చేస్తున్న రైతులు

కాలనీకి సుభాష్‌నగర్ పేరు పెట్టాలి

నిర్మల్ కల్చరల్, ఆగస్టు 26 : నిర్మల్ పట్టణం సోఫీనగర్ రోడ్ దర్గా వెనుక ప్రాంతంలో ఇందిరమ్మ ఇళ్లు నిర్మించిఇచ్చారని, దానికి సుభాష్ నగర్ కాలనీగా పేరు పెట్టాలని ఆ ప్రాంతవాసులు మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్‌ను కోరారు. సోమవారం ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. కౌన్సిల్ సభ్యులతో కలిసి నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు.

పాస్‌పోర్టు పోయినది

నేను SYED KAREEM S/O SYED BABU, R/O H.NO. 1-66, VILLAGE: TEMBURNI, MANDAL: NARSAPUR (G), DIST. NIRMAL, T.S. నాయొక్క పాస్‌పోర్టు నెం. S3682221 గల పాస్‌పోర్టు తేది 20.08.2024 రోజున టెంబుర్ని గ్రామం నుండి గుండంపెల్లి క్రాస్‌రోడ్ వరకు బస్సులో ప్రయాణించగా ఎక్కడో పడిపోయినది. దొరికినవారు ఈ క్రింది నెంబరుకు తెలియజేయగలరు. Cell: 9502666046


● డోలు వాయిస్తున్న గిరిజన కళాకారుడు


● ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజన గ్రామాలు
● బూర ఊదుతున్న ఆదివాసీ గిరిజనుడు

మళ్లీ.. ఉద్యమబాట

- జిల్లాలో ఏళ్ల తరబడి తమ సమస్యలకు పరిష్కారం చూపడం లేదంటున్న అడవి బిడ్డలు
- నేడు ఏజెన్సీ బంద్‌కు ఆదివాసీ సంఘాల పిలుపు
- ఎస్టీ జాబితా నుంచి వలస లంబాడాలను తొలగించాలంటూ డిమాండ్
- ఏజెన్సీ మారుమూల గ్రామాల్లో దయనీయ పరిస్థితి
- తరాలు గడుస్తున్నా.. మారని ఆదివాసీల తలరాతలు
- కాంగ్రెస్ ప్రభుత్వంపై భారీ ఆశలు పెట్టుకున్న ఆదివాసీలు

ఆదిలాబాద్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): ఏళ్ల తరబడి ఎన్నో పోరాటాలు, ఆందోళనలు చేస్తున్నా.. ఇటు ప్రభుత్వాలు, అటు పాలకులు తమ సమస్యలకు పరిష్కారమార్గం చూపడం లేదంటూ ఆదివాసీలు మళ్లీ ఉద్యమబాట పడుతున్నారు. మంగళవారం తుడుందెబ్బ ఆధ్వర్యంలో ఏజెన్సీ బంద్‌కు పిలుపు నిచ్చారు. రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా జిల్లాలోనే ఆదివాసీ జనాభా అధికంగా నివసిస్తున్నారు. గత ఐదారేళ్ల క్రితం జిల్లాలో జరిగిన ఆదివాసీ ఉద్యమాలతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే దిగి వచ్చాయి. అప్పట్లో ప్రభుత్వం ఉద్యమాన్ని చల్లార్చేందుకు ఎన్నో రకాలుగా ప్రయత్నాలు చేసింది. ఆదివాసీ గ్రామాల విద్యుత్ బిల్లుల మాఫీతో పాటు జిల్లా కలెక్టర్, ఎస్పీలపై బదిలీ వేటు వేసింది. అలాగే ఏజెన్సీ ప్రాంతంలో అల్లర్లకు కారణమైన వారిపై కఠిన చర్యలు చేపట్టింది. దీంతో పరిస్థితి కొంత అదుపులోకి వచ్చింది. అప్పటి నుంచి అడపదడపగా నిరసనలు, ర్యాలీలు, ఆందోళనలు చేస్తూ వస్తున్నారు. ఇటీవల ఎస్టీ వర్గీకరణకు సుప్రీం కోర్టు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడం ఆదివాసీలకు కొంత ఊరటనిచ్చిందనే చెప్పవచ్చు. జల్ జంగిల్ జమీన్ అనే నినాదంతో పోరాటాలు చేసిన కొమురంభీం స్ఫూర్తిగా ఆదివాసీలు మళ్లీ మరో ఉద్యమానికి సిద్ధమవుతున్నారు. దీర్ఘకాలిక సమస్యల కు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కారం చూపాలంటూ డిమాండ్ చేస్తున్నారు. నిరంతర ఉద్యమాలు చేస్తున్న ఆదివాసీలు అభివృద్ధికి ఇంకా ఆమడ దూరంలోనే కనిపిస్తున్నారు. హక్కుల కోసం గళమెత్తి పోరాటాలు చేస్తున్నా.. తమ తలరాతలు మాత్రం మారడం లేదంటూ ఆదివాసీలు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు.

ఆదివాసీల డిమాండ్లు ఇవే..

ఆదివాసీలు ఎన్నో పోరాటాలు, ఆందోళనలు, నిరసనలు చేస్తున్నా.. వారి సమస్యలకు పరిష్కార మార్గం దక్కడం లేదు. దీంతో మళ్లీ ఉద్యమించడమే సరైన మార్గం అంటూ ఆదివాసీలు భావిస్తున్నారు. గత ప్రభుత్వంపై ఎన్నో ఆశలు పెట్టుకున్న ఆదివాసీ సమస్యలపై పట్టింపే లేకుండా పోయింది. దీంతో కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆదివాసీలు భారీ ఆశలు పెట్టుకుంటున్నారు. ముఖ్యంగా ఎస్టీ జాబితా నుంచి వలస లంబాడాలను తొలగించడంతో పాటు జీవో నెం. 3ని పునరుద్ధరించి యధావిధిగా కొనసాగించాలి. ట్రైబల్ సబ్‌ప్లాన్ ఏరియా (టీఎస్‌పీఏ) పరిధిలోని 40శాతం ఆదివాసీ జనాభా ఉన్న గ్రామాలను ఏజెన్సీ ప్రాంతాలుగా గుర్తించాలి. ఏజెన్సీలో ప్రత్యేక డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ పోస్టుల భర్తీ, 29 శాఖలలో ఉన్న జీవోలను చట్టంగా మార్చాలి. ఆదివాసీలు సాగు చేస్తున్న పోడుభూములకు పట్టాలు ఇవ్వాలి. గిరివికాసం పథకం కింద బోరుబావులను మంజూరు చేయాలి. ఏజెన్సీలో 1/70 చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి. ఐటీడీఏలో ఉన్న బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలంటూ ఆదివాసీ 9 తెగలు డిమాండ్ చేస్తున్నాయి.

లంబాడాల తొలగింపునకు పట్టు

తమకు దక్కాల్సిన అవకాశాలు మరో వర్గానికి దక్కడంపై ఆదివాసీలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఎస్టీ జాబితా నుంచి వలస లంబాడాలను తొలగించాలంటూ పట్టుబడుతున్నారు. అవకాశాలన్నీ లంబాడా తెగకే దక్కడం తో తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆదివాసీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును ఆదివాసీలు స్వాగతిస్తున్నారు. దీంతోనైనా కొంతవరకు ఆదివాసీలకు న్యాయం జరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు. అయితే ఆదివాసీల రక్షణకు ఎన్నో ఏజెన్సీ చట్టాలు ఉన్న అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమవుతునే ఉన్నాయన్న ఆరోపణలు వస్తున్నాయి. గత కొన్నేళ్లుగా ఏజెన్సీలో గిరిజన తెగల మధ్య ఆధిపత్య పోరు కొనసాగుతున్నా.. సమస్య పరిష్కారానికి ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో 'మా ఊర్లో మా రాజ్యం' అనే నినాదంతో లంబాడా సామాజిక వర్గానికి చెందిన ఉద్యోగులు, ఉపాధ్యాయులను గ్రామాల్లోకి రానివ్వకుండా ఆదివాసీలు అడ్డుకున్నారు. దీంతో కొంత ఉద్రిక్త వాతావరణ పరిస్థితులకు దారి తీసింది. తమ వెనుకబాటుతనానికి మరో గిరిజన తెగనే కారణమంటూ పోరుబాట పట్టిన ఆదివాసీల భవిష్యత్తు ప్రశ్నార్థకంగానే మారింది.

ఆపదలో దేవుడే దిక్కు

జిల్లాలోని ఎన్నో మారుమూల గిరిజన గ్రామాలకు ఇప్పటికి కనీస రోడ్డు, రవాణా సౌకర్యం లేదంటే అతిశయోక్తి కాదు. అత్యవసర సమయంలో దేవుడేదిక్కంటూ భారం వేస్తూ.. బతుకు వెళ్లదీస్తున్నారు. ముఖ్యంగా వర్షాకాలం వచ్చిందంటే చాలు ఆదివాసీ గ్రామాలకు వణుకు పుట్టిస్తుంది. చిన్నపాటి వర్షాలకే వాగులు, వంకలు పొంగి ప్రవహించడంతో ఊరుదాటి బయటకు వెళ్లే పరిస్థితులు కనిపించడం లేదు. అత్యవసర సమయంలో వైద్యం అందక యేటా ఎందరో మంది ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి. ముఖ్యంగా ఆదివాసీ మహిళలను రక్తహీనత సమస్య వెంటాడుతూనే ఉంది. వీరికి ప్రసవమంటే పునర్జన్మగా మారింది. సరైన వైద్యం అందకపోవడం తో మాతా, శిశు మరణాల రేట్లు పెరగడం ఆందోళన రేపుతోంది. ఆదివాసీలు ఆచార సంప్రదాయాలకు కట్టుబడి మూఢ విశ్వాసాలతో జీవనం సాగిస్తున్నారు. ఇలా తీవ్ర అనారోగ్యం, పేదరికం, ఆర్థిక సమస్యలతో ఆదివాసీలు సతమతమవు తున్నారు. చదువుకోవాలన్న ఆశ ఉన్నా.. ఉన్నత విద్య అవకాశాలు అందుబాటులో లేకపోవడంతో ఊరికే పరిమితమవుతున్నారు. తమకు దక్కాల్సిన హక్కుల కోసం ఎన్నో పోరాటాలు చేస్తున్నా.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించడం లేదంటూ వాపోతున్నారు. మరోదారి లేకనే ప్రభుత్వాలు, పాలకులపై నిరంతర పోరాటాలు, ఉద్యమాలు చేయాల్సి వస్తుందని పేర్కొంటున్నారు.

బంద్‌కు 9 తెగల మద్దతు

: గోడం గణేష్, తుడుందెబ్బ రాష్ట్ర కమిటీ కోకన్వీనర్



ఏజెన్సీ బంద్‌కు 9 ఆదివాసీ తెగల మద్దతు ఉంది. పోరాటాలతోనే హక్కులను సాధించుకుంటాం. భారత రాజ్యాంగం కల్పించిన చట్టాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పకడ్బందీగా అమలు చేయాలి. గిరిజనేతరులతో ఏజెన్సీ ప్రాంతానికి రక్షణ లేకుండా పోతోంది. ఆదివాసీల రక్షణకు ఎన్నో చట్టాలు ఉన్నా.. ప్రభుత్వాలు అమలు చేయడం లేదు. ఎస్టీ వర్గీకరణ చేపడితే ఆదివాసీ తెగలకు కొంత వరకైనా న్యాయం జరిగే అవకాశం ఉంది. ప్రభుత్వాలు ఈ దిశగా చర్యలు తీసుకొని వెనుకబడిన ఆదివాసీలకు అండగా నిలవాలి.

ఉద్యమాలు ఆదివాసీలకు కొత్తేమీ కాదు

: సోయం బాపురావు, మాజీ ఎంపీ, ఆదిలాబాద్



ఆదివాసీలకు ఉద్యమాలు చేయడం కొత్తేమీ కాదు. కొమురంభీం స్ఫూర్తితో పోరాటాలు చేసి హక్కులను సాధించుకుంటాం. ఏళ్ల తరబడి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసీలను మోసం చేస్తూనే వస్తున్నాయి. ఇటీవల ఉన్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పుతో ఆదివాసీలకు కొంత వరకు న్యాయం జరుగుతుంది. వెంటనే ప్రభుత్వం ఎస్టీ వర్గీకరణ ప్రక్రియను చేపట్టాలి. ఎస్టీ జాబితా నుంచి వలస లంబాడాలను తొలగిస్తేనే ఆదివాసీలకు అవకాశాలు దక్కుతాయి. రాజ్యాంగ బద్ధంగా ఆదివాసీలకు దక్కాల్సిన హక్కుల కోసం ఎలాంటి పోరాటానికైనా సిద్ధమే. ఇకపై పూర్తిస్థాయిలో ఆదివాసీ ఉద్యమంపైనే దృష్టి సారిస్తాం.

లంబాడా జేఏసీ మద్దతు అవసరం లేదు : తుడుందెబ్బ

ఉట్నూర్, ఆగస్టు 26: ఆదివాసీ హక్కుల పోరాట సమితి, తుడుందెబ్బ, ఆదివాసీ 9 తెగలతో పాటు గొండ్వానా పంచాయతీ రాయి సెంటర్ ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో ఏజెన్సీ బంద్ చేపట్టనున్నామని, కాగా, లంబాడీ జేఏసీ నాయకులు మాట్లాడుతూ తమ మద్దతు కూడా ఉంటుందని చెప్పడం సరైంది కాదని, వారి మద్దతు అవసరం లేదని తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు పురక బాపురావు స్పష్టం చేశారు. సోమవారం మండలకేంద్రంలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆదివాసీలకు చెందిన 9తెగలు కలిసి పోరాడుతామని, 1976లో ఎమర్జెన్సీ ఉన్న సమయంలో అక్రమంగా ఒక జీవో ద్వారా ఎస్టీలుగా వచ్చారని, లంబాడాల వల్లనే ఉద్యోగ ఉపాధి అవకాశాలు, భూములు కోల్పోతున్నామని, వలసలు వచ్చి ఏజెన్సీ ప్రాంత హక్కులు, చట్టాలను భంగం కలిగిస్తూ ఆదివాసీలకు అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ ఏకైక ప్రధాన డిమాండ్ లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని, తర్వాతనే ప్రత్యేక డీఎస్సీ ఇతర డిమాండ్లు అన్నారు. మంగళవారం తలపెట్టిన బంద్‌లో అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని, అలాగే వ్యాపారస్థులు, విద్యాసంస్థలు సహకరించాలని కోరారు. ఇందులో జిల్లా ఉపాధ్యక్షుడు సిడం జంగదేవ్ పటేల్, ఆత్రం తిరుపతి, పెందూర్ త్రిమూర్తి, టేకం హరిప్రసాద్, పెందూరు తుకారాం, సిడాం బాపురావు, సిడాం భీమ్‌రావు, కొమ్రె కిషన్, తదితరులు పాల్గొన్నారు.

33 తెగల సమస్యలు ఉన్నాయి : లంబాడా జేఏసీ

ఉట్నూర్, ఆగస్టు 26: మంగళవారం తలపెట్టిన ఏజెన్సీ బంద్‌లో 33 తెగలకు సంబంధించిన గిరిజనుల సమస్యలు ఇమిడి ఉన్నాయని, అందుకే లంబాడా జేఏసీ ఆధ్వర్యంలో మద్దతు ప్రకటించడం జరిగిందని లంబాడా జేఏసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బానోత్ జగన్ అన్నారు. మండలంలోని లింగోజి తండాలో సోమవారం నిర్వహించిన లంబాడా జేఏసీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జీవో నెం.3, బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ, గిరిజన చట్టాల అమలు, తదితర డిమాండ్లు 33 తెగలకు సంబంధించినవి ఉండడం వల్ల బందుకు తాము కూడా మద్దతు ఇవ్వడం జరిగిందన్నారు. అంతే తప్ప వేరే దురుద్దేశం లేదని స్పష్టం చేశారు. పాలక వర్గాలు విభజించు పాలించు చేయడం వల్ల, ఏజెన్సీ ప్రాంతంలో గిరిజన హక్కులు రోజు రోజుకు కోల్పోయి నష్టం జరుగుతున్న విషయాన్ని గమనించాలని కోరుతున్నా మన్నారు. వలస లంబాడాలకు మేము కూడా వ్యతిరేకమేనని, పాలక వర్గాలు చేసే కుట్రలో భాగంగా.. విడిపోయి హక్కులు కోల్పోయే కంటే, ఐక్య ఉద్యమాలు చేసి ఉన్న హక్కులను కాపాడుకుంటూ కొత్త హక్కులు సాధించుకోవడానికి ముందుకు రావాలని తాము కోరుకుంటున్నామన్నారు. ఈ సమావేశంలో లంబాడా జేఏసీ ఉపాధ్యక్షుడు బానోత్ రామారావు, నేతావత్ రామదాసు, జిల్లా సలహాదారులు జాదవ్ గోపాల్ రావు, అజ్మీర వినోద్, విద్యార్థి సంఘం నాయకులు జాదవ్ సోమేశ, దారవాత్ శ్యామ్‌రావు, రాథోడ్ సన్నిప్, పవర్ విలాస్, రాథోడ్ కపిల్, తదితరులు పాల్గొన్నారు.

హైడ్రాను జిల్లాకు విస్తరించాలని సీఎంకు కంది విజ్ఞప్తి

ఆదిలాబాద్ అర్బన్, ఆగస్టు 26: చెరువులను పూడ్చి కబ్జాదారులు చేసిన అక్రమ నిర్మాణాలను తొలగించి తాగునీటి వనరులను సంరక్షించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి హైడ్రా ఏర్పాటు చేయడం అభినందనీయమని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీ కంది శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన పట్టణంలో విలేకరులతో మాట్లాడుతూ.. హైడ్రాను జిల్లాకేంద్రానికి కూడా విస్తరింప చేయాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఏ ముఖ్యమంత్రి కూడా చెరువుల రక్షణకు ముఖ్యమంత్రిలా సాహసం చేయలేదని పేర్కొన్నారు.


పట్టణంలోని ఇస్కాన్ ఆలయానికి పోటెత్తిన భక్తులు


చిన్నికృష్ణుడి ఊయల ఊపుతున్న మహిళలు, భక్తులు


యాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో ఉట్టి కొడుతున్న చిన్నారులు


శ్రీగోపాలకృష్ణ మఠంలో పూజలు చేస్తున్న పూజారి


సుందరచైతన్య సత్సంగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన శోభాయాత్రలో నృత్యాలు చేస్తున్న మహిళలు


కృష్ణుని ప్రతిమకు పూజలు చేస్తున్న జోగు రామన్న


పాటలు పాడుతూ భజనలు చేస్తున్న భక్తులు


చిన్నికృష్ణుడి బొమ్మలను వేస్తున్న చిన్నారులు, మహిళలు

ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

- ఇస్కాన్ టెంపుల్, యాదవ సంఘం ఆధ్వర్యంలో
- పాల్గొన్న ఎంపీ, ఎమ్మెల్యేలు

ఆదిలాబాద్ అర్బన్, ఆగస్టు 26: శ్రీకృష్ణాష్టమి వేడుకలను జిల్లాలో సోమవారం ఇస్కాన్ టెంపుల్, యాదవ సంఘం ఆధ్వర్యంలో అత్యంత వైభోపేతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే పాయల శంకర్‌లు హాజరయ్యారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రపంచ మానవాళికి తమ జీవితాన్ని ఏ విధంగా కొనసాగించాలని భగవద్గీత ఉందన్నారు. గతంలో కేవలం కొన్ని దేశాల్లోనే పరిమితమైన శ్రీకృష్ణాష్టమి జన్మదిన వేడుకలు ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా అన్ని దేశాలలో వేడుకలు జరుపుకుంటున్నారని గుర్తు చేశారు. ఇస్కాన్ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలు చాలా గొప్పవని, మనమంతా కలిసి మన ధర్మాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని గుర్తు చేశారు. అలాగే, మాజీ మంత్రి జోగు రామన్న ముఖ్య అతిథిగా పాల్గొని ముందుగా శ్రీకృష్ణ చిత్రపటం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ఇందులో నాయకులు ఆదినాథ్, విజయ్, అశోక్ రెడ్డి, మయూర్ చంద్ర, శ్రీనివాస్‌యాదవ్, ముకుంద్, విశాల్, నరేష్, శరత్ తదితరులు పాల్గొన్నారు.


చిన్నికృష్ణుడి వేషధారణలో చిన్నారి

● జిల్లాకేంద్రంలో శోభాయాత్ర

ఆదిలాబాద్ అర్బన్: శ్రీకృష్ణాష్టమిని పురస్కరించుకొని శ్రీస్వామి సుందర చైతన్యనంద సత్సంగ్ ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలో సోమవారం శోభయాత్ర నిర్వహించారు. స్థానిక మురళీకృష్ణ ఆలయం నుంచి పల్లకీలో శ్రీకృషుడి ఉత్సవ విగ్రహంతో ప్రధాన వీధుల గుండా శోభాయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా భజన సంకీర్తనలను ఆలపిస్తూ మహిళలు, యువతులు కోలాటాలు ఆడారు. అలాగే జిల్లాకేంద్రంలోని అతి పురాతనమైన శ్రీరామచంద్ర గోపాలకృష్ణ మఠంలో భక్తుల రద్దీ నెలకొంది. మఠాధిపతి శ్రీయోగానంద సరస్వతి నేతృత్వంలో పూజలు చేశారు.

సీడాం వంశీయుల నొవోంగ్ పూజ

బజార్‌హత్నూర్, ఆగస్టు 26: మండలం పరిదిలోని చింతల్‌సాంగ్వి గ్రామంలోని సీడాం వంశీయులు సోమవారం పంట చేలలో నొవోంగ్ పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. నొవోంగ్ అనగా నూతనంగా చేతికొచ్చే కూరగాయలు, ధాన్యాలు, పండ్లను, పంటలను పేర్సాపేన్, సతీకోపేన్, వన దేవతల ముందు ఉంచి పూజలు చేస్తారు. సామల బియ్యంను నెయ్యితో నైవేద్యం వండి దేవతలకు సమర్పిస్తారు. ఆ నైవేద్యంను సీడాం వంశీయులు మాత్రమే ఆరగిస్తారు. మిగితా వంటలను ఊరి ప్రజలకు అన్నదానం చేస్తారు. ఈ పూజల అనంతరం పండిన కూరగాయలను తినడం ప్రారంభిస్తారు.


పంటచేనులో పూజలు చేస్తున్న సిడాం వంశీయులు

రిమ్స్‌లో భద్రతపై డీఎస్పీ ఆరా

ఆదిలాబాద్ రూరల్, ఆగస్టు 26: కోల్‌కతా వైద్యురాలిపై జరిగిన ఘటనతో ఆదిలాబాద్ జిల్లా పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. ఈ నేపథ్యంలో ఎస్పీ గౌస్ ఆలం ఆదేశాల మేరకు రిమ్స్‌తోపాటు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో డాక్టర్లు, సిబ్బంది, ప్రజల భద్రతపై డీఎస్పీ జీవన్ రెడ్డి ఆరా తీశారు. ఈ మేరకు సోమవారం రిమ్స్ డైరెకర్ జైసింగ్ రాథోడ్, సీఐ, ఎస్సైలతో కలిసి ఆస్పత్రిలో పర్యటించి సీసీ కెమెరాల పనితీరు, ఇతరత్రా వాటిపై పర్యవేక్షించారు.


సీసీ కెమెరాల పనితీరును పరిశీలిస్తున్న డీఎస్పీ జీవన్ రెడ్డి